


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
02-07-2025
పేజీలు: 02



## మనుషుల ప్రాణాలంటే జగన్‌కు లెక్కలేదు

వైసీపీ అధినేత జగన్ పాలనతో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కిపోయిందన్నారు సీఎం చంద్రబాబు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో పాలన పడకేసిందన్నారు. పది లక్షల కోట్ల అప్పులు చేసి జగన్ ఆర్థిక వ్యవస్థను విధ్వంసం చేశారన్నారు. సీఎంగా 15 ఏళ్ల అనుభవం ఉన్న తనకే రాష్ట్రాన్ని గాడిలో పెట్టడానికి ఏడాది సమయం పట్టిందన్నారు సీఎం చంద్రబాబు. జగన్ కక్షపూరిత వైఖరి కారణంగా పోలవరం డయాఫ్రమ్ వాల్ కొట్టుకుపోయిందన్నారు చంద్రబాబు. 2027నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ప్రకటించారాయన. జగన్ పరామర్శల పేరుతో రౌడీయిజం చేస్తున్నారన్నారు ఏపీ సీఎం. పల్నాడు పర్యటనలో జగన్ వాహనం హిట్ అండ్ రన్ కారణంగా వైసీపీ కార్యకర్త సింగయ్య మరణించాడన్నారు.. జగన్‌కి మనుషుల ప్రాణాలంటే లెక్కలేదన్నారు చంద్రబాబు. సింగయ్య మరణానికి జగన్ వాహనం కారణం కాదని వైసీపీ బుకాయించిందన్నారు ముఖ్యమంత్రి.. దానికి తగినట్లు సాక్ష్యాలు కూడా సిద్ధం చేశారన్నారు. కానీ జగన్ కారు కిందే సింగయ్య పడి మరణించినట్లు పోలీసులు ఫోరెన్సిక్ సాక్ష్యాలు సేకరించారన్నారు చంద్రబాబు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇచ్చి మాట నిలబెట్టుకున్నామన్నారు చంద్రబాబు. పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం మలకపల్లిలో సీఎం చంద్రబాబు NTR భరోసా పెన్షన్లు పంపిణీ చేశారాయన.

## ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో @3 మంధాన

టీమ్ఇండియా మహిళా క్రికెట్ జట్టు ఓపెనర్ స్మృతి మంధాన ఐసీసీ ర్యాంకులలో తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. ఇప్పటికే ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉన్న మంధాన.. తాజాగా టీ20 ర్యాంకులలోనూ టాప్-3కు దూసుకొచ్చింది. ఇంగ్లండ్‌తో ముగిసిన తొలి టీ20లో శతకం బాదిన మంధాన.. ఒకస్థానాన్ని మెరుగుపరుచుకుని మూడో స్థానానికి ఎగబాకింది. ఆసీస్ బ్యాటర్ బెత్ మూనీ 794 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతుండగా విండీస్ అమ్మాయి హేలీ మాథ్యూస్ (774) రెండో స్థానంలో ఉంది. మంధాన 771 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది.



## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు గుడ్‌న్యూస్..
# డిప్యూటీ సీఎం భట్టి కీలక ఆదేశాలు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా తొలి విడతలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కాగా.. ప్రస్తుతం ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. కాగా, ఈ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి, సామాన్యులకు అందుబాటులో ఉండే ధరలకు నిర్మాణ సామగ్రిని అందించడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా.. సిమెంటు, స్టీల్, ఇటుక వంటి నిర్మాణ సామగ్రి ధరలను మండల స్థాయిలో నిర్ణయించడానికి ధరల నిర్ణయ కమిటీలు సమావేశం కావాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం (జూన్ 30) అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 ప్రాంతాల్లో ఇసుక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు భట్టి వెల్లడించారు. ఇసుక సామాన్యులకు మరింత అందుబాటులో ఉండేలా మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. దీని వల్ల ఇసుక కొరతను నివారించడమే కాకుండా.. అక్రమ ఇసుక రవాణాను కూడా నియంత్రిస్తుందని తెలిపారు. సర్కార్ నిర్ణయం వల్ల నిర్మాణ వ్యయం తగ్గి, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణం మరింత సులభతరం అవుతుందని భావిస్తున్నారు. అదే సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయడం ద్వారా అక్రమ లే అవుట్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ విషయంపైనా అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇక ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలను నిర్వహించేలా ప్రోత్సహించడం ద్వారా వారికి ఆర్థిక సాధికారత కల్పించాలని నిర్ణయించారు. కాలుష్య నియంత్రణకు గాను హైదరాబాద్‌లోని కాలుష్యకారక పరిశ్రమలను నగరం వెలుపలకు తరలించే అంశంపై కూడా చర్చించారు. గనుల శాఖలో వన్-టైమ్ సెటిల్‌మెంట్ విధానాన్ని అమలు చేయడం ద్వారా పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక వనరుల సమీకరణపై ఉపసంఘం తీసుకున్న నిర్ణయాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (CS) ఆధ్వర్యంలో ప్రతిరోజు సమీక్ష నిర్వహించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఈ నిరంతర సమీక్షల వల్ల ప్రభుత్వ పథకాలు, నిర్ణయాల అమలులో జాప్యం జరగకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది.





## 8 రోజులు, 5 దేశాలు..

భారత ప్రధాని నరేంద్ర మోడీ నేటి నుంచి ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల సుదీర్ఘ పర్యటనకు బయలుదేరనున్నారు. గత దశాబ్ద కాలంలో మోడీ చేస్తున్న అత్యంత సుదీర్ఘమైన విదేశీ పర్యటన ఇది. ఈ పర్యటనలో ఆయన ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియా దేశాలను సందర్శించనున్నారు. ముఖ్యంగా బ్రెజిల్‌లో జరిగే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో పాల్గొనడం ఈ పర్యటనలోని ప్రధాన ఉద్దేశ్యం. గ్లోబల్ సౌత్ దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడం, వాణిజ్యం, రక్షణ, శక్తి రంగాల్లో సహకారాన్ని పెంపొందించడంపై ప్రధాని మోడీ దృష్టి సారించనున్నారు. అలాగే, ప్రధానమంత్రి బ్రెజిల్‌లో జరిగే కీలకమైన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలోనూ పాల్గొంటారు. ప్రధాని మోదీ చివరి ఎనిమిది రోజుల పర్యటన జులై 2015లో ఆరు దేశాల పర్యటనకు వెళ్లారు. ఆ సమయంలో ప్రధాని మోడీ రష్యాతోపాటు ఐదు మధ్య ఆసియా దేశాలను సందర్శించారు. ఈ పర్యటన రక్షణ, అరుదైన భూమి ఖనిజాలు, ఉగ్రవాద నిరోధక చర్యలపై సహకారం వంటి అంశాలపై దృష్టి సారిస్తుందని అధికారులు తెలిపారు.



## హాలీవుడ్ ఎంట్రీకి రెడీ

సౌత్ నార్త్ లో స్టార్ హీరోల సినిమాల్లో నటించిన దిశాప టానికి ఆశించిన స్థాయిలో క్రేజ్ సొంతం కాలేదు.. సోషల్ మీడియాలో మాత్రం హీటెక్కించే ఫొటోస్ షేర్ చేస్తుంటుందిహాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమవుతోంది దిశా పటాని. ఆస్కార్ విన్నర్ కెవిన్ స్పేసీ నెక్ట్స్ సినిమాలో ఛాన్స్ అందుకుంది దిశా. కల్కి సినిమాలో బైరవగా నటించిన ప్రభాస్ కి జోడీగా కనిపించింది. పెద్దగా ఇంపార్టెన్స్ ఉన్న క్యారెక్టర్ కాదు కానీ సాంగ్ తో మెప్పించింది. కల్కి 2లో దిశా రోల్ కి కొంత ఇంపార్టెన్స్ ఉండొచ్చనే టాక్, కల్కి 2898 తర్వాత కంగువాలో నటించింది. ఈ సినిమాపైనా చాలా ఆశలు పెట్టుకుంది కానీ కలసి రాలేదు. కంగువా సక్సెస్ అయి ఉంటే వెంటనే సీక్వెల్ పట్టాలెక్కేది రానీ లెక్క తప్పింది. అయితే హిట్స్ ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుస ఆఫర్స్ అందుకుంటోంది.



## ప్రతి నెలా భార్య, కూతురుకు 4 లక్షలు ఇవ్వండి..
# క్రికెటర్ షమీకి హైకోర్టు ఆదేశం

టీమిండియా క్రికెటర్ మొహమ్మద్ షమీకి.. కోల్‌కతా హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. భార్య హసిన్ జహాన్‌తో పాటు కూతురికి ప్రతి నెలా నాలుగు లక్షలు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. మెయింటేనెన్స్‌లో భాగంగా ఆ అమౌంట్ ఇవ్వాలని కోర్టు తన తీర్పులో పేర్కొన్నది. భార్యకు నెలా 1.5 లక్షలు, కూతురుకు 2.5 లక్షలు ఇవ్వాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. జస్టిస్ అజయ్ కుమార్ ముఖర్జీ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. హసిన్ జహాన్ కోర్టులో పిల్ దాఖలు చేసింది. ప్రతి నెలా నాలుగు లక్షల మెయింటేనెన్స్ ఇవ్వడం వల్ల వాళ్లకు ఆర్థిక స్థిరత్వం ఏర్పడుతుందని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. జూలై ఒకటో తేదీన ఈ తీర్పు వెల్లడైంది. తాము ఇచ్చిన ఆదేశాలతో పాటు కూతురు చదువు కోసం లేదా ఇతర ఖర్చుల కోసం షమీ డబ్బులు ఇవ్వవచ్చు అని కూడా కోర్టు తెలిపింది. 2023లో ఇదే కేసులో జిల్లా సెషన్స్ కోర్టును జహాన్ ఆశ్రయించింది. భార్యకు 50వేలు, కూతురికి 80 వేలు ఇవ్వాలని సెషన్స్ కోర్టు ఆదేశించింది. అయితే ఆ తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టును జహాన్ ఆశ్రయించింది. ప్రతి నెలా తనకు ఏడు లక్షలు, కూతురికి మూడు లక్షలు ఇవ్వాలని జహాన్ కోర్టులో పిటీషన్ వేసింది. హసిన్ జహాన్‌ను 2014లో షమీ పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి ముందు ఆమె మోడల్‌గా, కోల్‌కతా నైట్ రైడర్స్ చీర్‌లీడర్‌గా చేసింది. 2015లో ఆ జంటకు కూతురు పుట్టింది. షమీ గృహహింసకు పాల్పడుతున్నట్లు 2018లో ఆమె కేసు పెట్టింది. వరకట్న వేధింపుల కేసు కూడా దాఖలు చేసిందామె. మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడినట్లు ఆరోపించింది. పాకిస్థానీ మహిళ నుంచి డబ్బులు తీసుకున్నట్లు ఆమె తన పిటీషన్‌లో పేర్కొన్నది. తన భర్త మెయింటేనెన్స్ ఖర్చులు ఇవ్వడం లేదని జహాన్ తన ఫిర్యాదులో ఆరోపించింది.

## త్వరలో భారత్‌తో వాణిజ్య ఒప్పందం

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా కీలక ప్రకటన చేశారు. భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చాలా తక్కువ సుంకాలతోనే ఈ డీల్ ఉంటుందని తెలిపారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో ట్రంప్ మాట్లాడుతూ.. అమెరికా సంస్థలకు పన్నులను తగ్గించడానికి న్యూ ఢిల్లీ సిద్ధంగా ఉందన్నారు. 'భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతున్నాం. అది ఓ కొత్త డీల్ అవుతుంది. అయితే, ప్రస్తుతం భారత్ ఆ డీల్‌ను ఇంకా అంగీకరించలేదు. ఒక వేళ వాళ్లు అంగీకరిస్తే.. చాలా తక్కువ సుంకాలతో డీల్ కుదురుతుంది' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అన్ని దేశాలపై అదనపు సుంకాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అదనపు సుంకాలకు గడువు జులై 8 వరకూ నిర్ణయించారు. అంతలోపు ఆయా దేశాలు మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉంటుంది. లేదంటే, జులై 9 నుంచి అదనపు సుంకాలు వడ్డిస్తారు. అంతలోపే వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవాలని ఇరు దేశాలూ భావిస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే చర్చలు కూడా జరుపుతున్నారు.



నేటి దినపత్రిక సూర్య EVENING EDITION 4PM
www.suryaa.com



# షానాయ కపూర్

## ఆంఖోంకి గుస్తాఖియాన్ ట్రైలర్

12th ఫెయిల్ వంటి క్లాసిక్ బ్లాక్‌బస్టర్ తర్వాత బాలీవుడ్ నటుడు విక్రాంత్ మెస్సే కథానాయకుడిగా వస్తోన్న నూతన చిత్రం ఆంఖోంకి గుస్తాఖియాన్. ప్రముఖ నటుడు అనీల్ కపూర్ సోదరుడు, నటుడు సంజయ్ కపూర్ కూతురు శాన్యా కపూర్ హీరోయిన్‌గా సినీ పరిశ్రమలోకి అడుగుపెడుతోంది. సంతోషింగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై11న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మంగళవారం రాత్రి ట్రైలర్ రిలీజ్ చేశారు. లవ్ బ్యాక్‌డ్రాప్‌లో సరికొత్త కాన్సెప్ట్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన పాటలు ఈ సినిమాపై అంచనాలను క్రియేట్ చేశాయి.



## తిరుమలలో చిరుత సంచారం

శేషాచలం అటవీ ప్రాంతం నుంచి బయటకు వస్తున్న చిరుతలు జనాన్ని భయపెడుతున్నాయి. జనావాసాల్లోకి వచ్చి సందడి చేస్తుండడంతో భక్తుల్లో అలజడి రేపుతోంది. జులై 1 మంగళవారం రోజున సాయంత్రం 6 గంటల సమయంలో తిరుమలలో కనిపించిన చిరుత కలకలం రేపింది. అన్నమయ్య భవన్ సమీపంలో తిష్ట వేసిన చిరుత గెస్ట్ హౌస్ వెనుక వైపు ఉన్న కంచెను దాటుకొని గోడపై సేదతీరుతూ కంటపడింది. గెస్ట్ హౌస్ వేనుకవైపు ఉన్న చెత్తాచెదారం వద్ద సంచరించే పందులు, కుక్కల కోసం వేట కొనసాగించింది. ప్రహరీ గోడ పై కూర్చుని మాటువేసిన చిరుత అక్కడి వారి కంట పడింది. స్థానికుల సమాచారం మేరకు చిరుత సంచారం తెలుసుకున్న టిటిడి అటవీశాఖ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంది. కానీ, అప్పటికే అక్కడున్న టిటిడి సిబ్బంది, భక్తులు పెద్ద పెద్ద శబ్దాలు చేసి చిరుతను అటవీ ప్రాంతం లోకి తరిమేసే ప్రయత్నం చేశారు. దీంతో చిరుత అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోగా భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. అప్రమత్తమైన టిటిడి సిబ్బంది చిరుత సంచారించిన ప్రాంతంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి చిరుత మూవెంట్ పై నిఘా పెట్టారు. మరోవైపు తిరుపతిలోనూ చిరుత హల్చల్ చేసింది. మంగళవారం రాత్రి జూ పార్క్ రోడ్డు లోని అరవింద్ ఐ ఆసుపత్రి వద్ద చిరుత స్థానికుల కంట పడింది. చిరుతను మొబైల్ లో క్యాప్చర్ చేసిన యువకులు అటవీ ప్రాంతంలోకి తరిమేసే ప్రయత్నం చేసారు. ఆటో, బైక్ లైటింగ్ సాయంతో శబ్దాలు చేస్తూ చిరుతను తరిమేందుకు ప్రయత్నం చేశారు. కాసేపు అక్కడే మాటు వేసిన చిరుత ఆ తరువాత అటవీ ప్రాంతంలోకి వెళ్ళిపోవడంతో అలిపిరి నుంచి జూ పార్క్ రోడ్డులో వెళ్లేవాళ్లు, కంటి ఆసుపత్రికి వచ్చిన వారు ఊపిరి పీల్చుకున్నారు.

## వెంటిలేటర్‌పై ఫిష్ వెంకట్



తెలుగు సినిమాల్లో కమెడియన్‌గాను, విలన్‌గాను నటించి మెప్పించాడు ఫిష్ వెంకట్ . మెయిన్ విలన్ పక్కన ఉంటూ తనదైన తెలంగాణ పంచ్‌లతో అలరించేవాడు. అయితే ఇటీవల ఆయన ఆరోగ్య పరిస్థితి ఏమి బాగుండడం లేదు. ఇప్పటికే కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న వెంకట్ గతంలో డయాలసిస్ తీసుకున్నారు. అప్పట్లో ఆరోగ్యం కొంత మెరుగైనట్లే కనిపించినా, ఇటీవల మళ్లీ ఆరోగ్యం క్షీణించడంతో ఆసుపత్రిలో చేరారు. ప్రస్తుతం ఆయన ఎవరినీ గుర్తుపట్టే స్థితిలో కూడా లేరు అన్న వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందిస్తున్నారు. వెంకట్ కుటుంబం ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉంది. చికిత్స ఖర్చులు భరించలేక దాతల సహాయం కోరుతోంది. ఆయన భార్య, కూతురు మీడియా ద్వారా ''దయచేసి మా ఫ్యామిలీని ఆదుకోండి'' అంటూ ప్రజలకు, సినీ ప్రముఖులకు వేడుకుంటున్నారు.గతంలో గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం చేయించుకున్న వెంకట్‌కు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రూ.2 లక్షల ఆర్థిక సాయం చేసి అండగా నిలిచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు మళ్లీ ఆరోగ్యం విషమించడంతో సాయం అవసరమైంది. వైద్యుల సమాచారం ప్రకారం, ప్రస్తుతం వెంకట్ డయాలసిస్‌పై ఉన్నారు, కానీ ఇది తాత్కాలిక పరిష్కారం మాత్రమే. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ అవసరమని చెబుతున్నారు. ఇది ఖరీదైన ప్రక్రియ కావడంతో కుటుంబం తీవ్ర ఆందోళనలో ఉంది. ఫిష్ వెంకట్ పరిస్థితిని చూసి అభిమానులు తీవ్రంగా కలత చెందుతున్నారు. తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ, ప్రముఖ హీరోలు, అలాగే 'మా' (మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్) స్పందించి ఆయనకు ఆర్థికంగా, మానసికంగా అండగా నిలవాలని కోరుతున్నారు. ఫిష్ వెంకట్ ''ఆది'' చిత్రంలో చెప్పిన ''తొడ గొట్టు'' డైలాగ్ ఇప్పటికీ ప్రేక్షకుల మదిలో మెదులుతూనే ఉంటుంది. పవన్ కల్యాణ్ నటించిన ''గబ్బర్ సింగ్'' లోనూ తన కామెడీతో కడుపుబ్బ నవ్వించారు.



## 95 శాతం రేషన్ పంపిణీ పూర్తి.. తెలంగాణ సివిల్ సప్లై శాఖ సరికొత్త రికార్డు

తెలంగాణ రాష్ట్రంలోని పౌర సరఫరాల శాఖ రేషన్ పంపిణీలో సరికొత్త రికార్డు సృష్టించింది. జూన్, జులై, ఆగస్టు మూడు నెలలకు కలిపి ఒకేసారి రేషన్ పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మూడు నెలలకు సంబంధించి.. మొత్తం 95 శాతం మంది లబ్ధిదారులకు విజయవంతంగా రేషన్ పంపిణీ పూర్తి చేసినట్లు తెలిపారు. సాధారణంగా ప్రతి నెల చేసే రేషన్ పంపిణీలో కనీసం 85 శాతం కూడా మించదని.. కానీ ఈసారి ఒకే నెలలో మూడు నెలల కోటాను 95 శాతం పూర్తి చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తెలంగాణలో రేషన్‌కార్డు ఉన్న వారికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మూడు నెలల రేషన్ పంపినీలో భాగంగా లబ్ధిదారులకు 5.40 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 17,349 రేషన్ షాపుల ద్వారా 91.83 లక్షల రేషన్ కార్డుదారులకు ఈ పంపిణీ జరిగింది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ చేయాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేయగా.. ఆమేరకు రాష్ట్ర ప్రభుత్వం రేషన్ పంపిణీ చేసింది.

**పలు జిల్లాల్లో 100 శాతానికి పైగా రేషన్ పంపిణీ**

రాష్ట్రవ్యాప్తంగా మూడు నెలల రేషన్ పంపిణీ జూన్ 1 నుంచి ప్రారంభం అయ్యింది. దీనిలో భాగంగా ఒక్కో లబ్ధిదారుడికి 18 కిలోల చొప్పున మొత్తం 5.72 లక్షల టన్నుల రేషన్ సిద్ధం చేశారు. ఇందులో 95 శాతం అంటే 5.40 లక్షల టన్నుల బియ్యం 30 రోజుల్లోగా పంపిణీ చేశారు. ఈ పంపిణీలో దాదాపు 2.65 కోట్ల లావాదేవీలు జరిగాయని సివిల్ సప్లయ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ డీఎస్ చౌహాన్ తెలిపారు. కొన్ని జిల్లాల్లో 100 శాతానికి పైగా రేషన్ పంపిణీ జరిగిందని వెల్లడించారు.. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఎక్కువ మంది లబ్ధిదారులకు రేషన్ అందించారు. హైదరాబాద్‌లో 103 శాతం, మేడ్చల్‌లో 113 శాతం, రంగారెడ్డి జిల్లాలో 110 శాతం రేషన్ పంపిణీ జరిగిందని తెలాపరు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వలసదారులకు కూడా రేషన్ అందించడం వల్ల ఇది సాధ్యమైందన్నారు అధికారులు. అలానే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 18 జిల్లాల్లో 90 శాతానికి పైగా రేషన్ అందింది.


**సెప్టెంబర్ వరకు నో రేషన్**

మూడు నెలల రేషన్ పంపిణీ జూన్ 30, సోమవారంతో ముగిసింది. ఇకసెప్టెంబర్ వరకు రేషన్ పంపిణీ ఉండదని సివిల్ సప్లయ్స్ అధికారులు స్పష్టం చేశారు. ఒకేసారి 5.40 లక్షల టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం వల్ల ఎక్కువ మందికి లబ్ధి చేకూరింది. మూడు నెలల కోటాలో 5 శాతం మినహా అందరికీ రేషన్ అందించామని అధికారులు తెలిపారు.

**కొత్త సాఫ్ట్‌వేర్‌తో సాంకేతిక సమస్యలకు చెక్..**

రేషన్ షాపుల్లో వినియోగించే ఎలక్ట్రానిక్ పాయింట్ ఆఫ్ సేల్ (ఈ-పీఓఎస్) మెషీన్లలో కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించారు. దీని ద్వారా మూడు నెలల రేషన్‌ను ఒకేసారి ఇవ్వడానికి వీలైంది. రాష్ట్రంలో 91.83 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. ప్రతి నెలా రేషన్ పంపిణీలో భాగంగా లబ్ధిదారుల నుంచి రేషన్ డీలర్లు రెండుసార్లు వేలిముద్రలు తీసుకుంటారు. అయితే జూన్ నెలలో మూడు నెలల రేషన్ ఒకేసారి ఇవ్వడంతో ఒక్కో నెలకు రెండుసార్లు చొప్పున మూడు నెలలకు ఆరుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి వచ్చింది. దీనిని సులభతరం చేయడానికి ఆరుసార్లు వేలిముద్రలు తీసుకునే విధానాన్ని మూడింటికే పరిమితం చేశారు అధికారులు. మూడు నెలల రేషన్‌ను ఒకే నెలలో పకడ్బందీగా పంపిణీ చేశామని అధికారులు తెలిపారు. రోజువారీగా పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకున్నామని వెల్లడించారు. మిల్లుల నుంచి సన్న బియ్యాన్ని తెప్పించి.. వెంటనే స్టాక్ పాయింట్లకు తరలించామని, అక్కడి నుంచి రేషన్ షాపులకు చేర్చామని తెలిపారు. మూడు నెలల కోటా కోసం 5.72 లక్షల టన్నుల సన్న బియ్యం సిద్ధం చేశామని అధికారులు వెల్లడించారు.

## ముదురుతున్న గేమ్ ఛేంజర్ వివాదం




నితిన్ ప్రధాన పాత్రలో వేణు శ్రీరామ్ తెరకెక్కించిన చిత్రం తమ్ముడు. ఈ చిత్రాన్ని దిల్ రాజు శ్రీవెంకటేశ్వర బేనర్‌పై నిర్మించారు. జూలై 4న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. హీరో హీరోయిన్స్‌తో పాటు నిర్మాతలు దిల్ రాజు, శిరీష్‌లు కూడా పలు ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఆసక్తికర విషయాలు తెలియజేస్తున్నారు. ఇదే సమయంలో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'గేమ్ ఛేంజర్' చిత్రం గురించి నిర్మాత శిరీష్ చేసిన వ్యాఖ్యలు ఇటీవల టాలీవుడ్‌లో పెద్ద వివాదంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శిరీష్ స్వయంగా స్పందించి, ఓ బహిరంగ లేఖను విడుదల చేశారు. ఓ ఇంటర్వ్యూలో శిరీష్ మాట్లాడుతూ, ''గేమ్ ఛేంజర్ విడుదల తర్వాత హీరో రామ్ చరణ్ గానీ, డైరెక్టర్ శంకర్ గానీ కనీసం ఫోన్ చేయలేదు. నష్ట నివారణ చర్యల గురించి మాట్లాడలేదు అని వ్యాఖ్యానించడంతో, ఈ మాటలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యాఖ్యలపై మెగా అభిమానులు తీవ్రంగా స్పందించారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌ను టార్గెట్ చేస్తూ విమర్శలు గుప్పించారు. ''చరణ్ పూర్తి సహకారం అందించినా, ఇలా మాట్లాడటం సరైంది కాదు అంటూ ట్రోల్ చేశారు. ఈ పరిస్థితిని గమనించిన శిరీష్ వెంటనే స్పందించారు. తన వ్యాఖ్యల వల్ల ఎవరైనా బాధపడితే అది ఉద్దేశపూర్వకమైంది కాదని స్పష్టం చేస్తూ, ఓ బహిరంగ లేఖ ద్వారా క్షమాపణలు తెలిపారు.



## తిరుమలలో భారీగా తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల తిరుపతి దేవస్థానంలో గత రెండు నెలలుగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. అమావాస్య సందర్భంగా స్వల్పంగా తగ్గిన భక్తుల రద్దీ మళ్లీ పెరిగింది. ప్రతి రోజూ శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం పడుతుండగా సోమవారం భారీ రద్దీ కనిపించింది. కానీ మంగళవారం ఉదయం భక్తుల రద్దీ భారీగా తగ్గింది. బుధవారం తెల్లవారుజామున శ్రీవారిని దర్శించుకునేందు కు నాలుగు కంపార్ట్మెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. నిన్న 76,126 మంది భక్తులు దర్శించుకోగా రూ.3.97 కోట్లుహుండీ ఆదాయం వచ్చింది.

## భోజనంలో బొద్దింక కాదు వెంట్రుక వచ్చింది: హోంమంత్రి అనిత



తన ఆహారంలో బొద్దింక వచ్చిందన్న ప్రచారంపై ఎపి హోంమంత్రి అనిత స్పందించారు. తన భోజనంలో చిన్న తల వెంట్రుక కనిపించిందని, తన భోజనంలో బొద్దింక వచ్చిందని వైఎస్ఆర్ సిపి కార్యకర్తలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వైసిపి సోషల్ మీడియా పేజీలలో ఫేక్ వార్తలను ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంపై బురద చల్లాలని వైసిపి నేతలు చూస్తున్నారని అని ధ్వజమెత్తారు. గత ఐదేళ్లలో వైసిపి మంత్రులు ఎమ్మెల్యేలు కనీసం ఒక్క హాస్టల్ నైనా తనిఖీ చేశారా? అని నిలదీశారు. తాము చిత్తశుద్ధితో పని చేస్తున్నాని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది అయిన సందర్భంగా తొలి అడుగు కార్యక్రమం చేపట్టామని వివరణ ఇచ్చారు. వైసిపి నేతలలో మానవత్వం అనేది ఎక్కడా కనిపించడం లేదని, అధికారంలోకి రావాలని సిఎం కూర్చీలో కూర్చోవాలని వైసిపి అధినేత జగన్ అలోచన చేస్తున్నారని అనిత దుయ్యబట్టారు. పాయకరావు పేట బిసి బాలికల కాలేజీ హాస్టల్‌ను హోంమంత్రి అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి మెనూ పాటించడంలేదని, వార్డెన్ అందుబాటులో ఉండలేదని, హాస్టల్ సెక్యూరిటీ గార్డు, వార్డున్‌ను హోంమంత్రి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.